

మహిళల భద్రతకు శక్తి యాప్ : ఎస్ఐ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



జిఎంఎస్‌కెలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

అత్యవసర పరిస్థితుల్లో మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను ప్రతి మహిళ వినియోగించేలా అవగాహన కల్పించాలని ఎస్ఐ వి.క్రాంతి కుమార్ మండలంలోని మహిళా పోలీసు(జిఎంఎస్‌కె)లకు ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ శక్తి యాప్‌ను వినియోగించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆయా సచివాలయాల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జిఎంఎస్‌కెలతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బస్సుకు రైట్.. రైట్..!

15 నుంచి స్త్రీ శక్తి పథకం అమల్లోకి

ఆర్‌టిసి బస్సుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం

రెండు జిల్లాల్లో 77 వేల మంది మహిళలకు ప్రయోజనం

పశ్చిమలో 223, ఏలూరు జిల్లాలో 177 బస్సుల్లో ఉచిత ప్రయాణం

రెండు జిల్లాలవ్యాప్తంగా 96 రూట్లలో అవకాశం

రద్దు చేసిన రూట్లలో బస్సులను పునరుద్ధరిస్తారా?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అందుకు సంబంధించిన విధివిధానాలను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 15 నుంచి స్త్రీ శక్తి పథకం కింద ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి రానుంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రజారవాణా శాఖాధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్టు ఇప్పటికే ప్రకటించారు. ఉచిత బస్సు ప్రయాణంపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. పథకం అమలుపై అనేక అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. జిల్లాల్లో పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంది. మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డనరీ బస్సులు విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో మాత్రమే ఉంటాయి. ఏలూరు జిల్లాలో మూడు డిపోల పరిధిలో 309 బస్సులు ఉన్నాయి. వీటిలో 162 పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, 15 ఎక్స్‌ప్రెస్ బస్సులు మొత్తం 177 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ ఏర్పాట్లు చేశారు. మొత్తం 63 రూట్లలో ఈ బస్సులు తిరగనున్నాయి. ప్రస్తుతం సగటున రోజుకు 80 వేల మంది ప్రయాణిస్తుండగా 32 వేల మంది మహిళా ప్రయాణికులు ఉన్నట్లు ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. ఉచిత ప్రయాణం అమల్లోకి వస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగనున్నట్లు అంచనా వేస్తున్నారు. అందుకు తగిన విధంగా బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో మొత్తం 298 బస్సులు ఉండగా, 223 బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించనుంది. జిల్లాలో 33 ప్రధాన రూట్లలో ఉచిత ప్రయాణం సాగనుంది. పశ్చిమగోదావరి జిల్లాలో రోజుకు సగటున 82 వేల మంది ప్రయాణికులు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళా ప్రయాణికులు 45 వేల మంది వరకూ ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఉచిత బస్సులో ప్రయాణంతో మహిళల సంఖ్య మరింత పెరగనుంది. ఉచిత బస్సు ప్రారంభించిన తర్వాత దాదాపు మూడు నెలలు బాగా రద్దీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. బస్సులు చాలకపోతే స్కూల్ బస్సులను సైతం నడిపే ఆలోచనలో ఆర్‌టిసి యాజమాన్యం ఉంది. కండక్టర్లు, ఇతర సిబ్బందిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

రద్దు చేసిన రూట్లను పునరుద్ధరిస్తేనే ప్రయోజనం

ప్రయాణికులు సరిపడా లేరని, రోడ్లు సరిగా లేవనే పలు కారణాలతో రెండు జిల్లాల్లో అనేక రూట్లలో బస్సు సౌకర్యాన్ని ఆర్‌టిసి నిలిపివేసింది. ఏలూరు జిల్లాలో అటువంటి గ్రామాలు 113 వరకూ ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రయాణికులంతా ఆటోలు, ఇతర వాహనాల్లో పట్టణ ప్రాంతాలకు చేరుకోవాల్సి వస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమల్లోకి తెస్తున్న నేపథ్యంలో గతంలో రద్దు చేసిన రూట్లలో ఆర్‌టిసి బస్సులను నడపాలని జనం కోరుతున్నారు. తమకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. నిలిచిపోయిన రూట్లలో బస్సు సౌకర్యం కల్పించినప్పుడే పథకం పూర్తిస్థాయిలో ప్రజలు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

నులిపురుగుల నివారణే రక్త హీనతకు పరిష్కారం

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



చిన్నారికి మాత్ర వేస్తున్న కలెక్టర్

నులిపురుగుల నివారణతోనే రక్తహీనత సమస్య అధిగమించి ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏలూరులో విద్యార్థులకు ఆమె నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంగళవారం మాత్రలు తీసుకోని వారికి ఈ నెల 18న మాప్ అప్ కార్యక్రమం ద్వారా మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు అడ్డంకిగా మారిన నులిపురుగుల నివారణ ఒక్కటే మార్గమన్నారు. పిల్లల కడుపులో నులిపురుగులు చేరి రక్తహీనత, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వం టి సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. ఆల్బెండ జోల్ మాత్రలు వేసుకోవడంతో కడుపులో నులిపురు గులు నశించిపోతాయన్నారు. కార్యక్రమంలో డిఎం హెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఎన్‌టిఆర్ వైద్య సేవ డిసి డి.రాజేష్, సర్వశిక్ష అభియాన్ ఎపిసి డాక్టర్ కె.పంకజ్ కుమార్, ఐసిడిఎస్ జిల్లా అధికారి పి.శారద, పిఒ కె.నరేంద్రకృష్ణ, నోడల్ ఆఫీసర్ వి.వేణు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శీరిష, సిడిపిఒ ఎ.సత్యవతి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

కైకరంలో సిపిఎం ఆధ్వర్యాన ప్రచారం

ప్రజాశక్తి - ఉంగుటూరు



నిరసిస్తున్న నేతలు, ప్రజలు

స్మార్ట్ మీటర్లు వద్దు.. పాత మీటర్లు ముద్దు అంటూ సిపిఎం ఆధ్వర్యాన కైకరంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ అదానీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను పెట్టడం వల్ల ముందుగా మనం కరెంటు కొనుక్కొని వాడుకోవాల్సి వస్తుందన్నారు. తాము అధికారంలోకొస్తే స్మార్ట్‌మీటర్లను రద్దు చేస్తామన్న కూటమి నేతలు ఇప్పుడు వాటినే కొనసాగించడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు సిరా అప్పారావు, గుత్తికొండ కృష్ణారావు, కె.అప్పారావు, వెంకటేశ్వరరావు, అల్లు గోవిందరావు, ఒడిసి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత ప్రయాణానికి 177 బస్సులు సిద్ధం

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌కె.షబ్నం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలుకు 177 బస్సులు సిద్ధం చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌కె.షబ్నం తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఉచిత బస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మూడు డిపోల పరిధిలో మొత్తం 309 బస్సులు ఉండగా అందులో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుండి 162 పల్లె వెలుగు బస్సులు, 15 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఈ పథకానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఏలూరు నుండి 23, జంగారెడ్డిగూడెం నుండి 22, నూజివీడు నుండి 18 రూట్లలో మొత్తం 63 రూట్లలో ఉచితంగా ప్రయాణించొచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి ఉండగా, మన జిల్లాలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే అవకాశం ఉందని, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ సర్వీసులు మన జిల్లాలో లేవని తెలిపారు. అలాగే నాన్‌స్టాప్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం లేదన్నారు. బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆధార్, ఓటర్ కార్డులను చూపించి జీరో టిక్కెట్ తీసుకుని ప్రయాణించొచ్చని తెలిపారు. ప్రయాణ సమయంలో, బస్సులు ఎక్కే సమయంలో ఒకరినొకరు తోసుకోకుండా బస్సు ఎక్కాలని, తోపులాట వల్ల నగలు, సెల్‌ఫోన్లు దొంగిలించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు. స్త్రీ శక్తి ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్న బస్సులను గుర్తించడానికి బస్సులపై ఎటువంటి చిహ్నాలు ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, పిఆర్ఒ నరసింహం పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల పేరుతో రికవరీ తీరు దుర్మార్గం

బలి పశువులవుతున్న ఉపాధి హామీ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు

డ్వామా పీడీకి ఎపి వ్యకాస నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు



వినతి అందిస్తున్న నేతలు

కొల్లేరు ప్రాంత ప్రజలకు జీవనాధారంగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు రాబోయే కాలంలో జరుగుతా యో, లేదోననే ఆందోళనలో ప్రజలు ఉన్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో డ్వామా పీడీ వెంకట సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కొల్లేరు నిత్యం నీటితో నిండి ఉండే ప్రాంతమన్నారు. ఇలాంటి ప్రాంతంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న సమయంలోనే సామాజిక తనిఖీలు చేయాలని తెలిపారు. అయితే అధికారులు పనులు పూర్తయిన సంవత్సరం తర్వాత సామాజిక తనిఖీల పేరుతో వచ్చి రూ.లక్షల్లో రికవరీ రాయడం వల్ల మేట్లకు, ఉపాధి కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. రికవరీలు చేయాలంటూ జిల్లా అధికారులు, ఎపీడీలు ఫీల్డ్ అసిస్టెంట్లను వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సామాజిక తనిఖీలను పని ప్రదేశాల్లో జరపాలని, రికార్డుల వెరిఫికేషన్ పనులు జరుగుతున్న సమయంలోనే చేపట్టాలని కోరారు. ఇలా జరపకపోవడం వల్ల ఉపాధి హామీ కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు కొలతల్లో తేడాలు ఉన్నాయని, ఫొటోల ఆధారంగా వీటిని పరిగణనలోకి తీసుకోలేమని చెప్పడం అంటే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల మెడకు ఉరితాడు బిగించడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నేతల ఒత్తిడితో ఉపాధి హామీలో లేని పనులను కూడా చేయించడం వల్ల ఫీల్డ్ అసిస్టెంట్లకు, మేట్లకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. వారు రూ.లక్షల్లో రికవరీలు కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాజకీయ నాయకుల వేధింపుల వల్ల ఉపాధి పనులలో అవినీతి జరుగుతుందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల సమస్యలు పరిష్కరించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రాంతంలో మాన్యువల్ పద్ధతిలోనే ఉపాధి హామీ పనులు చేపట్టాలని కోరారు. ఉపాధి పని ప్రదేశాల్లో పనిముట్లు, మెడికల్ కిట్లు, కనీస సౌకర్యాలైన తాగునీరు, టెంట్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందని తెలిపారు. కూలీలకు ఇవ్వాల్సిన కనీస వేతనం రూ.307 ఎక్కడా అమలు కాలేదన్నారు. జిల్లాలో మొత్తం 150 పంచాయతీల్లో ఒక్క పంచాయతీలో కూడా పేస్లిప్ ఇవ్వకపోగా కూలీలకు వేతనాలు నెలలు తరబడి పెండింగులో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు రావాల్సిన వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో చేపలు, రొయ్యల చెరువులతోపాటు కొల్లేరు నిత్యం నీటితో ఉండటం వల్ల ఉపాధి పనులు లోపభూయిష్టంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగేశ్వరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పి-4 పక్కనబెట్టి.. పేదలకు భూములు పంచండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పి-4 పథకం ఉద్యోగులకు ఇబ్బంది కల్గించేలా, సంపన్నులకు లాభం చేకూర్చేలా, పేదలను గాలికొదిలేసేలా ఉందని, పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వమే భూమి పంచాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గుర్తించిన 51,192 బంగారు కుటుంబాలను 6,654 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలని నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా పేదరికాన్ని నిర్మూలిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన మాటలు, వాగ్దానాలు అవాస్తవాలని నేడు రుజువైందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకపక్క జీతాలు సక్రమంగా ఇవ్వకుండా, పెంచాల్సిన వేతనాలు పెంచకుండా, ఇవ్వాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో ఇవ్వకుండా అనేక ఇబ్బందులు పెడుతూ మరోపక్క బంగారు కుటుంబాలను పైకి తీసుకొచ్చే బాధ్యత మీదేనని ఉద్యోగ, ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించి వ్యవహరిస్తుందని విమర్శించారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చే వారికి బంగారు కుటుంబాలు అప్పగించడంపై తమకేమీ అభ్యంతరం లేదని తెలిపారు. ఆగిరిపల్లి మండలం చినఆగిరిపల్లి వద్ద ఉన్న అసైన్డ్ భూమి దాదాపు 300 ఎకరాలు రకరకాల పరిశ్రమల ఏర్పాటు పేరుతో పారిశ్రామికవేత్తలకు అప్పనంగా కట్టబెట్టే పని రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి కుమారుడు నితిన్‌కృష్ణకు బయోప్లాంట్ నిర్మాణానికి 45 ఎకరాలు కేటాయించారని పేర్కొన్నారు. సుమారు రూ.11 కోట్లు విలువైన భూములు ఇస్తూ, నితిన్‌కృష్ణ 10 కుటుంబాలను దత్తత తీసుకుని పేదరికం నుండి బయటపడే కార్యక్రమం చేస్తారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన పేరుతో పి-4 పథకం సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చేందుకు ఉపయోగపడేలా ఉందని విమర్శించారు. నిజంగా పేదరికాన్ని రూపుమాపాలంటే జిల్లాలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఒక కుటుంబానికి ఒక ఎకరం చొప్పున పంచి, వారు వ్యవసాయం చేసుకునే విధంగా రాయితీలు ఇచ్చి, అవకాశాలు కల్పిస్తే ఇటు పేదలు, అటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తక్షణం ప్రస్తుత పి-4 పథకాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో సిపిఎంగా పేదలను సమీకరించి జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు సాగిస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థి సంఘాలపై ఆంక్షలు సరికావు

విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలకు అనుమతినివ్వాలి

నేడు, రేపు విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

రౌండ్ టేబుల్ సమావేశంలో పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



అభివాదం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పాఠశాలల ఆవరణలోకి విద్యార్థి సంఘాలకు అనుమతి నిరాకరిస్తూ పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు ఎం.జయంత్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని మాట్లాడుతూ విద్యాశాఖ, ఇంటర్ బోర్డ్ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు, విద్యార్థి సంఘాలకు వ్యత్యాసం ఉందని, రెండింటిని ఒకే గాటిన కట్టడం మంచిది కాదని తెలియజేశారు. విద్యార్థి సంఘాలు విద్యార్థుల హక్కులకై నినదిస్తాయని తెలిపారు. నూతన విద్యా విధానంలో భాగంగా విద్య వ్యాపారాన్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నాయని విమర్శించారు. ఎప్పటినుంచో విద్యార్థి సంఘాల గొంతు నొక్కేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని ఇప్పటి వరకూ వ్యతిరేకిస్తూ విద్యార్థి ఉద్యమాలు నిర్వహించామని, ఆ ఉద్యమాలను కొనసాగిస్తామని, వెంటనే ఉత్తర్వులు వెనక్కి తీసుకుని విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేసారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేష్ విద్యార్థి సంఘాలను పిలిచి, సమస్యలను విని, మీరు గట్టిగా పోరాడండి అంటూ అందరిని ప్రోత్సహించారని, అధికారంలోకి వచ్చాక వెంటనే విద్యార్థి సంఘాలపై ఇటువంటి నిబంధనలు విధించడం మాట మార్చడమే అని తెలిపారు. ఈ ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఈనెల 13, 14 తేదీలలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకంలో వికలాంగులనూ చేర్చాలి

ఎన్‌పిఆర్‌డి జిల్లా కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 15వ తేదీ నుండి ప్రవేశపెడుతున్న స్త్రీ శక్తి పథకంలో వికలాంగులను కూడా చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పిఆర్‌డి) జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి. సోమయ్య, అధ్యక్షులు కుందేటి జయరాజు, కార్యదర్శి ఎస్‌కె.సుభాషిని మంగళవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అవయవాలు సరిగా ఉన్న వాళ్లకు ఇచ్చే ప్రోత్సాహకాన్ని వికలాంగులకు కూడా వర్తింపజేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మానసిక, శారీరక వికలాంగులకు ప్రభుత్వం ఆర్‌టిసి బస్సుల్లో కొంత రాయితీ ఇస్తుందని, కొంత ఛార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వసూలు చేసే ఛార్జీలను పూర్తిగా రద్దుచేసి, పూర్తి రాయితీ కల్పించాలని, వికలాంగులకు ఉచితంగా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. ఆమేరకు ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 27లో సవరణలు తీసుకువచ్చి వికలాంగులందరికీ కూడా ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసే విధంగా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో వికలాంగుల సంఘాల తరపున ఆందోళన చేపడతామని ఆ ప్రకటనలో తెలిపారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలపైన దాడులను ఎదుర్కోవటానికి సంబంధిత చట్టాలు ఉపయోగించుకొని రక్షణ పొందవచ్చునని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఆయన మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలపై దాడులు, 1955 ప్రజా పౌర హక్కులు, 1989 షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల చట్టాలపైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో బాధితుల ఫిర్యాదును నమోదు చేయకపోతే వాటిని ప్రయివేట్ కంప్లైంట్ ద్వారా కోర్టులలో దాఖలు చేయవచ్చు అని తెలియజేశారు. అలాగే ఈ చట్ట ప్రకారం ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యాన ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కేసుల పురోగతిపై సమీక్షించాల్సి ఉందన్నారు. సాక్షుల రక్షణ బాధ్యతను కూడా ప్రభుత్వాలు తీసుకోవాలని, బాధితులకు పరిహారాన్ని చెల్లిస్తారని, పరిహారాన్ని పొందటంలో ఏవైనా సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. పౌర హక్కుల రక్షణ చట్టం ప్రకారం ప్రతి పౌరుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించడానికి ప్రాథమిక హక్కులు కల్పించిందని, ఈ ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, న్యాయవాది పి. రత్నరాజు, సోషల్ వర్కర్ మేతర అజయ్ బాబు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం ద్వారా ఆదాయం : డిపిఒ

ప్రజాశక్తి - ముసునూరు

చెత్త సంపద కేంద్రం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని డిపిఒ కె.అనురాధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో డిపిఒ అనురాధ ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణల ఆధ్వర్యాన చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె డోర్ టు డోర్ కలెక్షన్ విధానాన్ని పరిశీలించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా కూడా చెత్త కనిపించకుండా చూసుకోవాలని, చెత్త ద్వారానే గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ చౌదరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాసరావును అభినందించి సత్కరిస్తున్న సిఐ రవికుమార్, సిబ్బంది

హోం గార్డు నుంచి కానిస్టేబుల్‌గా..

ప్రజాశక్తి - మండవల్లి

కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది అంటూ ఏమీ ఉండదని హోంగార్డు శ్రీనివాసరావు రుజువు చేశారని కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ స్పష్టం చేశారు. హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ పరీక్షలు రాసి సివిల్ కానిస్టేబుల్‌గా ఎన్నికైన శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో ఘనంగా దుశాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడితే సాధించలేనిదంటూ ఏమీ ఉండదని ఆయన అన్నారు. శ్రీనివాసరావు 2012లో కృష్ణాజిల్లాలో హోంగార్డుగా ఎంపికై కైకలూరు రూరల్ పోలీస్ స్టేషన్ మండవల్లి, విజయవాడ విటిపిఎస్ఎస్ కైకలూరు సిడబ్ల్యుసిలో పనిచేయడం జరిగిందన్నారు. పనిచేసిన ప్రతిచోట ఎంతో క్రమశిక్షణగా విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారని తెలిపారు. కానిస్టేబుల్ అవ్వాలనే కోరికతో ఉన్న శ్రీనివాస్ హోంగార్డుగా పని చేస్తూనే ఎంతో శ్రమించి కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించి సివిల్ కానిస్టేబుల్ అయ్యాడని తెలిపారు. హోంగార్డుగా పనిచేస్తూ కానిస్టేబుల్ అవ్వడం అనేది చిన్న విషయం కాదని, ఎంతో కష్టపడితే గాని సాధ్యమవుతుందని అన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన శ్రీనివాసరావును ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కానిస్టేబుల్‌గా విధులను సక్రమంగా నిర్వహించి అధికారుల మన్ననలు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రాంబాబు, శ్రీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు గంబూషియా చేపలు కీలకం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం

ఏలూరు సిటీ : దోమల వృద్ధిని అరికట్టుటలో గంబూసియా చేపలు కీలకంగా పని చేస్తాయని తద్వారా దోమల ద్వారా సంక్రమించే ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులు అరికట్టుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పిజె.అమృతం, మున్సిపల్ ఇన్‌ఛార్జి, అడిషనల్ కమిషనర్ శివారెడ్డి సూచించారు. స్థానిక తంగెళ్లమూడిలోని లక్ష్మీ నగర్, నేతాజీ నగర్, విద్యుత్ నగర్, పార్క్ వీధి తదితర ప్రాంతాల్లో గంబూసియా చేపల విడుదల కార్యక్రమాలు ప్రారంభిస్తూ ఈ సందర్భంగా జిల్లా అధికారి డాక్టర్ పిజె. అమృతం మాట్లాడుతూ మనిషికి ఆహారం ప్రకృతిలో లభించే వస్తువులు అయితే ఈ గంబూసియా చేపలకి దోమలు పెట్టే లార్వాలు ఆహారమని, ఈ లార్వాలు తినడం వల్ల దోమల వ్యాప్తిని అరికట్టుకోవచ్చని అన్నారు. ఏలూరు పట్టణ నీటి నిల్వ ప్రాంతాలలో గంబూసియా చేపలు విడుదల చేయడం వల్ల దోమల వ్యాప్తి అరికట్టుకోవచ్చని, తద్వారా డెంగీ, మలేరియా, బోదకాలు, చికెన్‌గునియా మొదలగు వ్యాధులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అనేక ప్రాంతాలలో ఈ చేపల విడుదల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ప్రతి సంవత్సరం వర్షాకాలంలో దోమల నివారణ పద్ధతులైన గంబూసియా చేపల విడుదల నీటి నిల్వ ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వదలడం, సాయంత్రం సమయంలో షాకింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రి కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దొరసానమ్మ, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఎంపిహెచ్ఇఒ బసవరాజు, కృష్ణారావు, హెల్త్ సూపర్వైజర్ కె. నిర్మల, మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, మలేరియా హెల్త్ అసిస్టెంట్స్ మేకా శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

హనుమాన్ నగర్‌లో నూతన వంతెన నిర్మించాలి

సిపిఎం నగర కమిటీ విజ్ఞప్తి

ఏలూరు అర్బన్ : ఏలూరు మినీ బైపాస్ రోడ్‌లోని హనుమాన్ నగర్ వద్ద పెరిగిన రవాణా అవసరాలు రీత్యా నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఏలూరులో మంగళవారం సిపిఎం నగర కార్యదర్శి పంపన రవి కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు ప్రమాద భరితంగా మారాయని, హనుమాన్ నగర్ వంతెన మినీ బైపాస్ రోడ్ కంటే ఎత్తులో, ఇరుకుగా ఉండటం వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు ప్రమాదాలకి గురి అవుతున్నారని చెప్పారు. గత పదేళ్లలో హనుమాన్ నగర్, కొత్తూరు సుందరయ్య కాలనీలో పెరిగిన జనాభా అవసరాలకి ఈ వంతెనపై ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువై ట్రాఫిక్ స్తంభించి పోతుందన్నారు. విద్యాసంస్థలకి, ఉద్యోగాలకి వెళ్లేవారు ఈ వంతెనపై ట్రాఫిక్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జూట్ మిల్లు దగ్గర నిర్మిస్తున్న వంతెన మాదిరి హనుమాన్ నగర వద్ద రోడ్ మార్జిన్లు సరిచేసి ప్రజలకి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా మహేష్



కలిదిండి : సిఐటియు మండల కన్వీనర్‌గా జక్కుల మహేష్ ఎన్నికయ్యారు. సిఐటియు ఐదవ మండల మహాసభలో 18 మందితో కమిటీ ఎన్నికైనట్లు తెలిపారు. మండల కో - కన్వీనర్లుగా ఎస్.కె.అబిదా బేగం, అబ్దుల్ అక్బర్ ఎన్నికయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులను ఐక్యం చేసి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

క్రిమిసంహారక ఎరువుల వాడకం తగ్గించాలి

జీలుగుమిల్లి : రైతులు పండించే పంటలలో క్రిమి సంహారక ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయాధికారి కె.గంగారావ్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని దర్బగూడెం, స్వర్ణవారిగూడెం రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పలు రకాల పంటలను పరిశీలించారు. హార్టికల్చర్ అసిస్టెంట్ దీపిక, రైతులు సాంబ, దావీదు, చిరంజీవి పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

జీలుగుమిల్లి : హర్ ఘర్ తిరంగా ర్యాలీలో భాగంగా జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి కళాశాల నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించినట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.సతీష్‌కుమార్ తెలిపారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు ప్రసన్న కుమార్, శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ప్రదర్శన

మండవల్లి: విద్యార్థి దశనుండే దేశంపై భక్తి భావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్.భాస్కర్ రావు స్పష్టం చేశారు. కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ ఉచితంగా అందించిన జాతీయ జెండాలను స్థానిక గ్రంథాలయం వద్ద ఐక్యవేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శించారు. ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ అప్పారావు, గంజాల శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతానికి బాలసదనం తరలింపు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని బాలసదనాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు ఐసిడిఎస్ సిడిపిఒ పిల్లి విజయకుమారి తెలిపారు. సిడిపిఒ విజయకుమారి మంగళవారం మాట్లాడుతూ ఇప్పటివరకు బాలసదనం కొనసాగిన భవనం మరమ్మతులకు గురి కావడంతో చిన్నారుల రక్షణ కోసం సురక్షితమైన ప్రాంతానికి తరలించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశంతో సురక్షితమైన ప్రాంతం, నియమ నిబంధనలతో పరిశీలించి బాలసదనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న బాలసదనం ప్రైవేట్ అద్దె ఇంటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఈ బాలసదనంలో 24 మంది పిల్లలు ఉన్నట్లు సిడిపిఒ విజయ కుమారి తెలిపారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన క్రీడా పోటీలు

జంగారెడ్డిగూడెం : క్రీడలు శరీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటానికి దోహదపడతాయని సివిల్ జడ్జి కిషోర్ కుమార్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం ఛత్రపతి శివాజీ డిగ్రీ కళాశాల గ్రౌండ్లో పోలీసులు, న్యాయవాదులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వింజమూరి కిరణ్ కిషోర్, జిఎస్ఆర్ మూర్తి టీంలు తలపడ్డాయి. విజేతలుగా వింజమూరి కిరణ్ కిషోర్ టీం నిలిచింది. రన్నర్స్‌గా పాశం ప్రతాప్ టీం నిలిచింది. కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు కూడా నిర్వహించారు. విజేతలందరికీ స్వాతంత్ర దినోత్సవం రోజున గౌరవ మెజిస్ట్రేట్స్ చేతుల మీద మెమొంటోలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మేకా ఈశ్వరయ్య, కొల్లూరు సతీష్, గర్సికూటి చిరంజీవి రాంబాబు, మోడేపల్లి నాగులు పాల్గొన్నారు.

జగన్‌ను సిఎం చేయాలి

వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు సుధాకర్

ఏలూరు సిటీ : ప్రతి దళిత బిడ్డకు ఉద్యోగం రావాలన్న, సంక్షేమం అందాలన్న, అభివృద్ధి చెందాలన్న జగన్ మోహన్ రెడ్డిని సిఎం చేయాలని వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. జిల్లా ఎస్‌సి సెల్ విస్తృత స్థాయి సమావేశం జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడు ప్యారా ఆనంద్ ఆధ్వర్యాన ఏలూరులోని శుభలేఖ కన్వెన్షన్ హాల్లో మంగళవారం నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త విజయరాజు, పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం బాలరాజు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

ఏలూరు సిటీ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథ పాలకుల దినోత్సవంను పురస్కరించుకుని భారతీయ గణిత శాస్త్రజ్ఞులు గ్రంథపాలకులు, గ్రంథాలయ శాస్త్ర పితామహులు అయిన పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 133వ జయంతిను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎమ్.శేఖర్‌బాబు ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. జ్యోతి లెక్చరర్ ఇన్ లైబ్రేరియన్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నగేష్ లైబ్రేరియన్ ఏలూరు కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ ఆఫ్ టెక్నాలజీ, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యాన 'నేషనల్ లైబ్రేరియన్స్ డే'ను పురస్కరించుకొని మంగళవారం ప్రముఖ జాతీయ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు, రచయిత, విద్యావేత్త, పద్మశ్రీ డాక్టర్ షియాలి రామామృత రంగనాథన్ 133వ జయంతి కార్యక్రమాన్ని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముందుగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు మాట్లాడారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.రాంబాబు, వి.వెంకటరావు, ఎస్.పరమేశ పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం, అభివృద్ధిపై ప్రచారం

దెందులూరు : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాదేపల్లి, జాలిపూడి, కాటంపూడి గ్రామాల్లో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటిస్తూ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పాలనను ప్రజలకు వివరిస్తూ స్వయంగా కరపత్రాలను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి అవసరమైన వైద్య చికిత్సకు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

బుట్టాయగూడెం : మండలంలోని రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం-2005పై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి ప్రియాంక అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సమాచార హక్కుకు సంబంధించి సమాచారాన్ని ఎలా పొందుపరచాలి, సమాచార హక్కు చట్టంను ఏ విధంగా ఉపయోగించుకోవాలో రైతులకు తెలియజేశారు.

పిహెచ్‌సిల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

నోడల్ అధికారి శిరీషా

ఆగిరిపల్లి: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టడంతో పాటు మాతాశిశు మరణాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని మాతా శిశు సంరక్షణ కార్యక్రమ నోడల్ అధికారి శిరీషా అన్నారు. ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి ఆరోగ్యకేంద్రంలో అందజేస్తున్న సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవాల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అడుగడుగునా అవస్థలే..!

రహదారులు అస్తవ్యస్తం
కనీసం గుంతలైనా పూడ్చండి
ఆగిపల్లి, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, ముసునూరు మండలాల ప్రజల వేడుకోలు

జిల్లాలో ఎక్కడ చూసినా అధ్వానమైన రహదారులే దర్శనమిస్తున్నాయి. రహదారులన్నీ గోతులమయమై వర్షం వస్తే నీరు చేరి వాహనదారులకు ప్రాణ సంకటంగా మారాయి. దీంతో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు భయం గుప్పెట్లో ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుంతలన్నీ పూడ్చేస్తాం, రహదారుల రూపురేఖలు మార్చేస్తాం అని వాగ్దానాలు పలికి నేడు ఆచరణలో మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతలు పడి, సిమెంటు లేచిన రహదారులే కనిపిస్తున్నాయి. పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధ్వానమైన రహదారిలో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రయాణికులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

అడుగడుగునా గోతులమయం..



జంగారెడ్డిగూడెం-దేవులపల్లి రహదారి

జంగారెడ్డిగూడెం : మండలంలోని లక్కవరం గ్రామానికి వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నామని వాహనదారులు వా పోతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా లక్కవరం రోడ్డు బాగుపడేలా లేదని విమర్శిస్తున్నారు. జంగారెడ్డిగూడెం వెళ్లి రావాలంటే గోతుల వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. జంగారెడ్డిగూడెం నుంచి దేవులపల్లి రహదారి గోతులమయంగా ఉంది. అక్కడ నుంచి లక్కవరం రావాలంటే ఇంకా నరకంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ రోడ్డు దుస్థితి చూసి, మరమ్మత్తులు చేయించాలని లక్కవరం గ్రామస్తులు, వాహనదారులు కోరుకుంటున్నారు.

బురదమయంగా అంతర్గత రోడ్లు..



కొండకాలనీలోని 9వ వార్డు అంతర్గత రోడ్డు

ఆగిరిపల్లి : కొద్దిపాటి వానకే ఆగిరిపల్లి కొండ కాలనీ 9వ వార్డులో అంతర్గత రోడ్లు బురదమయంగా మారి పాదాచారులు, వాహనదారులు ప్రయాణించాలంటే ప్రాణ సంకటంగా మారిందని ఆ వార్డు ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల ముందు తమ వార్డుకు వీధి దీపాలు, పంచాయతీ కుళాయిలు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు చేసిన నాయకులు తమ వార్డు వైపు కన్నెత్తి అయినా చూడటం లేదని, కొండ ప్రాంతానికి సమీపంలో వుండటం, వర్షాకాలం కావడంతో కురిసిన వానలకు రోడ్లు అధ్వానంగా మారటం ఒక ఎత్తు అయితే వీధి దీపాలు లేక విషపురుగుల సంచారంతో చీకటిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతకాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి కొండకాలనీ 9వ వార్డులో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆ వార్డు ప్రజలు కోరుతున్నారు.

చెరువును తలపించేలా రహదారి..



కామయ్యపాలెం రహదారి

జీలుగుమిల్లి : మండలంలోని బర్రింకలపాడు నుంచి కామయ్యపాలెం వెళ్లే ప్రధాన రహదారిపై గోతులు పడటంతో కొద్దిపాటి వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పి.రాజవరం రహదారి మధ్యలో గోతుల్లో వర్షం నీరు నిలబడి వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో పాటు లారీలు వెళ్లినప్పుడు నీరు వెదజల్లి చుట్టు పక్కన నివాసదారులకు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని వారు వాపోతున్నారు. గోతులమయమైన రహదారి గుండా రాత్రిళ్ల ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కామయ్యపాలెం నూతన సచివాలయం సమీపంలో పెద్ద పెద్ద గోతులు పడి రహదారి చెరువును తలపిస్తుండటంతో అటుగా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. గతకొన్ని నెలల క్రితం ఈ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా పనులు చేపట్టకపోవడంతో పాటు కనీసం మరమ్మత్తులు కూడా చేయకుండా వదిలేయడంతో అవి కాస్త పెద్ద పెద్ద గోతులుగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

గోతులైనా పూడ్చరూ..




సింహాద్రిపురం గ్రామంలోని రోడ్డు

ముసునూరు : కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం పూర్తయ్యింది కానీ రోడ్లకు మాత్రం మోక్షం కలగలేదు. ఏలూరు టు నూజివీడు వయా సింహాద్రిపురం, పోతిరెడ్డిపల్లి, చింతలవల్లి, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల గ్రామాల మీదగా ఏలూరు వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రహదారి పూర్తిగా గోతులమయంగా మారి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గత ఆరేడు సంవత్సరాల నుండి ప్రమాదాలకుగురై మృతిచెందిన ఘటనలు అనేకం. కూటమి ప్రభుత్వం వచ్చి రాగానే గోతులు పూర్తి చేసి గోతుల్లేని రహదారులను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని గొప్పలు చెప్పుకుంది తప్ప ఆచరణలో మాత్రం చేసింది శూన్యం. కనీసం గోతులు కూడా పూడ్చలేకపోవటంపై పలువురు విమర్శిస్తున్నారు.

రుణాలు, ఎరువులు సకాలంలో అందించాలి : ఎంఎల్ఎ

దెందులూరు: రైతులందరికీ రుణాలు, ఎరువులు సకాలంలో అందించడంతో పాటు అన్ని తరగతుల ప్రజలకు సేవలు అందించి సొసైటీలను అభివృద్ధి చేయాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఇటీవల నూతనంగా నియమించబడిన సొసైటీల అధ్యక్షులకు సూచించారు. మండలంలోని జోగన్నపాలెం సొసైటీ అధ్యక్షులుగా డాక్టర్ పసుమర్తి మధు, పెదవేగి మండలం ముండూరు బ్యాంక్ అధ్యక్షులుగా కొనకళ్ల శివమణి నూతనంగా నియమితులైన సందర్భంగా వారు దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాల అందించి శాలువాలతో సత్కరించారు. తమకు ఛైర్మన్లుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

జాతీయ నాయకుల విగ్రహావిష్కరణ

చింతలపూడి : ఎంతో మంది పోరాట యోధుల త్యాగ ఫలితమే మనకి స్వాతంత్రం వచ్చిందని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర సమరయోధులు, జాతీయ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరు క్రమశిక్షణ, సమయపాలన, విధేయత కలిగి ఉండాలని, స్వాతంత్ర సమరయోధులను, జాతీయ నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల విద్యాశాఖాధికారులు, హెచ్ఎం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ భవానీ

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మండల వ్యవసాయాధికారి జె.భవానీ

ఆగిరిపల్లి: రైతులు సమగ్ర యాజమాన్య సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులను సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి జె.భవానీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కనసానపల్లి, అడవినెక్కలం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కలిగివుండి నగదు జమకానీ రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళలకు అస్వస్థత


పోలవరం : పాముకాటుతో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురైన సంఘటన మండలంలో మంగళవారం జరిగింది. పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జిల్లేల్లగూడెం గ్రామ పంచాయతీ రెడ్డి కుంకాల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ వాయిల పద్మ, పోలవరం పంచాయతీ ఏనుగులవారి వీధికి చెందిన వ్యవసాయ కూలీ నగేరు లక్ష్మి పొలాలలో పని చేస్తుండగా పాముకాట్లకు గురయ్యారు. అస్వస్థతకు గురైన వారిని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి టి.కృష్ణంరాజు వైద్య సేవలందించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని, అబ్జర్వేషన్లో ఉంచడం జరిగిందని వైద్యులు తెలిపారు.

ఇఒపిఆర్‌డిగా లక్ష్మీనారాయణ

మండవల్లి : మండలానికి నూతన ఇఒపిఆర్‌డిగా బి.లక్ష్మీనారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప.గో జిల్లా ఇరగవరం మండలం రేలంగి గ్రామపంచాయతీలో గ్రేడ్ వన్ కార్యదర్శిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ ఉద్యోగోన్నతిపై మండవల్లికి వచ్చారు.

పలుచోట్ల జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

విద్యార్థులకు మాత్రల పంపిణీ



ముదినేపల్లిలో..

టి.నరసాపురం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని మర్రిగూడెంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్ఎ.ప్రసాద్ ఆధ్వర్యాన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్ పి.రోహిణి, విహెచ్ఎస్.విజయశాంతి, ఆశాలు లావణ్య పాల్గొన్నారు.

భీమడోలు: పిల్లల ఆరోగ్య పరిరక్షణ, రక్తహీనత నివారణకు నులిపురుగు నివారణా మాత్రలు వేసుకోవాలని జిల్లా ఇమ్యులైజేషన్(డిఐఒ) డాక్టర్ శోభ కోరారు. గుండుగొలను పిహెచ్‌సి పరిధిలోని పలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో నులిపురుగు నివారణా మాత్రల పంపిణీ కార్యక్రమం, విద్యార్థులకు వాటిని వేసే ప్రక్రియను జిల్లా అధికారి తనిఖీ చేశారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రతి విద్యార్థి పాఠశాల, ఇంటి పరిసరాల వద్ద పరిశుభ్రత పాటించాలని వైద్యులు షకీనా ఇవాంజీలిన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో, ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. 4082 మందికి మాత్రలు పంపిణీ చేశారు.

ఏలూరు సిటీ : ఏలూరు రూరల్‌లోని మానూరు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తేర ప్రసాద్ ఆధ్వర్యాన విద్యార్థులకు ఆల్బండోజోల్ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.


ముదినేపల్లి : పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల వారిలో పోషకాహారలోపం, రక్తహీనత, ఆకలి మందగించడం వంటి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని ముదినేపల్లి స్పామ్ ఐటిఐ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ముదినేపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యాన అందజేసిన ఆల్బెండజోల్ మాత్రలను ఐటిఐ విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ కె.హరిత, ఒ.మణిబీమరాజు, బి.కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని స్థానిక బాయ్స్ హై స్కూల్, అంగన్వాడీ, ప్రయివేట్ స్కూల్స్‌లో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఆర్.లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు మింగించారు. కోనేరు పేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సుధా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలి

పామాయిల్ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పి.రామకృష్ణ

చింతలపూడి : పామాయిల్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా కల్పించాలని పామాయిల్ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ పామాయిల్ కార్మిక సంఘం ఆధ్వర్యాన చింతలపూడి మార్కెట్ యార్డ్ వద్ద జిల్లా విస్తృత సమావేశం తుమ్మల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పి.రామకృష్ణ మాట్లాడుతూ పామాయిల్ గెలలు నరికి లోడు, అన్లోడింగ్ చేసే కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. పామాయిల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదంలో ఇటీవల కాలంలో కరెంట్ షాక్ గురై జిల్లా వ్యాప్తంగా 20 మందిపైగా 25 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు యువకులు చనిపోయారని తెలిపారు. వాళ్లకి ఫ్యాక్టరీ నుంచి గాని ఉద్యాన శాఖ, విద్యుత్ శాఖ నుంచి రావలసిన నష్టపరిహారం ఇంత వరకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పామాయిల్ గెలల మీద పడి నడుముకి, కాళ్లు, చేతులు విరిగిపోయి మంచానికే పరిమితమై ఉన్న కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్మికులు ప్రమాదాలకు గురై వికలాంగులుగా మారితే కనీసం వికలాంగుల పెన్షన్ కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. అనంతరం పలు తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాండురంగారావు, ఆర్ఎస్.నారాయణ, జి.వెంకట్రావు, డి.సత్యనారాయణ మద్దతు ఇచ్చి మాట్లాడారు. కళ్లచెరువు, బొరంపాలెం, వీరభద్రవరం, చింతలపూడి, రేచర్ల, జీలుగుమిల్లి, సెట్టివారిగూడెం, టి.నర్సాపురం, తాళ్ల గోకవరం, కొప్పులవారి గూడెం గ్రామాల్లో పామాయిల్ కార్మికులు హాజరైయ్యారు.



నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

వృద్ధురాలికి ఆర్థిక సాయం

ముదినేపల్లి: అనారోగ్యంతో బాధ పడుతున్న నిరుపేద వృద్ధురాలికి మేము సైతం టీం మంగళవారం నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీకి చెందిన రావూరి అమ్మాజీ కొంతకాలంగా భుజం నొప్పితో బాధపడుతూ ఎటువంటి పనులకీ వెళ్లలేకపోవడం వల్ల ఆమె పోషణకై కొంతకాలంగా ఇబ్బందులు పడుతుంది. విషయం టేకు కనకచారి ద్వారా తెలుసుకున్న టీం మొవ్వ ఫణీంద్ర ఆధ్వర్యాన అమ్మాజీకి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కొంత ఆర్థిక సహాయం దాకరం గ్రామ సర్పంచి జాస్తి రాఘవేంద్రరావు, వి.రావిగుంట మాజీ సర్పంచి భూపతి రవీంద్ర చేతుల మీదుగా అందజేశారు. పాస్టర్ ఉచ్చుల విజయకుమార్, స్వర్జన్ రాజు, బట్టగాని ఏసుదాస్ పాల్గొన్నారు.

'ఎటువంటి మట్టి తవ్వకాలూ లేవు'

ద్వారకాతిరుమల : మండలంలోని పి.కన్నాపురం గ్రామ పంచాయతీ ఇల్లిందాల కుంట చెరువు నుండి మట్టిని అక్రమార్కులు వరుసగా 3 రోజులు ప్రభుత్వ సెలవులు కావడంతో 'జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు' అను శీర్షికన ఈనెల 11వ తేదీ ప్రచురితమైన వార్తకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ సెక్షన్ వివరణ ఇచ్చారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ఇ సబ్ డివిజన్ ఏలూరు వారితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఎటువంటి మట్టితవ్వకాలు జరగలేదన్నారు. భవిష్యత్తులో జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు.